సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
గురువారం । 12 । డిసెంబర్ । 2024



... శిక్షణ మాటేమిటి?

పంచాయతీ కార్మికుల వేతనాలు అకౌంట్లలో జమ చేయాలని నిర్ణయించినా నైపుణ్య శిక్షణ కూడా ఇప్పించాలనే డిమాండ్ వస్తోంది. 10లో



క్రీడాపోటీలకు ఆతిథ్యం

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల నిర్వహణకు పాల్వంచ మండలం లక్ష్మీదేవిపల్లి బాలుర గురుకుల కళాశాల రెండోసారి ఆతిథ్యం ఇస్తోంది. 10లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం
29° / 17°

జిల్లాలో గురువారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. సాయంత్రం తర్వాత చలి తీవ్రత క్రమంగా పెరుగుతుంది.

న్యూస్‌రీల్

రామయ్యకు స్నపన తిరుమంజనం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారికి బుధవారం వైభవంగా స్నపన తిరుమంజనం జరిపారు. తొలుత తెల్లవారు జామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

నేటి నుంచి మంత్రి తుమ్మల పర్యటన

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం నుంచి మూడు రోజులపాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. గురువారం ఉదయం పది గంటలకు ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లో జరిగేసమీక్ష సమావేశంలో పాల్గొంటారు. అలాగే, మధ్యాహ్నం 3.30 గంటలకు గాంధీచౌక్‌లోని నర్తకి థియేటర్ రోడ్డులో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేయనున్న మంత్రి, 4గంటలకు రఘునాథపాలెం మండలం వెంకటాయపాలెంలో మూడో రైల్వే లైన్ భూనిర్వాసితులకు ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేస్తారు. అలాగే, శుక్రవారం ఉదయం 10 గంటలకు దమ్మపేట మండలం అలీపురంలో గ్రామపంచాయతీ, పాఠశాల భవనాలను ప్రారంభిస్తారు. ఇక శనివారం ఉదయం 10 గంటలకు అశ్వారావుపేటలోని అగ్రికల్చర్ కళాశాల డైమండ్ జూబ్లీ వేడుకల్లో మంత్రి పాల్గొననున్నారు.

నేడు ఎస్సీ వర్గీకరణపై బహిరంగ విచారణ

ఖమ్మం సహకారనగర్: ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ గురువారం విచారణ చేపట్టనుందని ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. ఖమ్మం కలెక్టరేట్‌లో ఉదయం 11నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు కమిషన్ చైర్మన్ జస్టిస్ షమీం అక్తర్ ఆధ్వర్యాన విచారణ చేయనున్నారని వెల్లడించారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని షెడ్యూల్డ్ కుల సంఘాల నాయకులు వర్గీకరణపై వినతులు అందించవచ్చని తెలిపారు.

వైభవంగా మహా చండీయాగం

తల్లాడ: లోక కళ్యాణార్థం గ్రామస్తులంతా ఏకమై నిర్వహించిన మహా చండీయాగం వైభవంగా ముగిసింది. తల్లాడ మండలం నారాయణపురంలో 70 హోమ గుండాలు ఏర్పాటుచేసి 90 మంది బ్రాహ్మణుల సమక్షాన కంచెల సతీష్‌శర్మ, పెనుగంచిప్రోలుకు చెందిన రాజోలు భానురవికిరణ్‌శర్మ బుధవారం ఈ యాగం జరిపించారు. తెల్లవారుజామున గణపతి పూజతో మొదలైన యాగంలో 207 మంది దంపతులు కూర్చున్నారు. ఇందులో 200 క్వింటాళ్ల పాయసం, వివిధ రకాల పూజాసామగ్రిని ఉపయోగించారు. హోమశాలను అరటి ఆకులు, బంతిపూలతో అలంకరించగా ప్రతీ ఇంటికి బంధుమిత్రులు రావడమే కాక నారాయణపురం, తల్లాడ పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు రావడంతో నారాయణపురం ఆధ్యాత్మికతను సంతరించుకుంది.

ఇదేం సహకారమో!?



జిల్లాలోని ఓ కొనుగోలు కేంద్రంలో ఆరబోసిన ధాన్యం

ధాన్యం కొనుగోళ్లలో సర్దుబాటు దందా

- ప్రభుత్వ కేంద్రాల్లో భారీగా అవకతవకలు
- రైతుల కోటాలో విక్రయిస్తున్న వ్యాపారులు
- వారితో కుమ్మక్కవుతున్న సిబ్బంది

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: వాట్సాప్ స్టేటస్‌లు, చాయ్ పే చర్చల్లో రైతులకు అండగా ఉంటామని చెప్పడానికి అందరూ ముందుకొస్తారు కానీ.. క్షేత్రస్థాయిలో అన్నదాతలకు అండగా నిలిచే వారు కరువైపోతున్నారు. చివరకు కొనుగోలు కేంద్రాలు నిర్వహించే ప్రాథమిక సహకార సంఘాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

దళారులకే ఎక్కువ..

జిల్లా వ్యాప్తంగా 5.80 లక్షల ఎకరాల భూమి సాగవుతుండగా పట్టాదారు పాసు పుస్తకాలు కలిగిన రైతులు 1.77 లక్షల మంది ఉన్నారు. ఇందులో కేవలం రెండెకరాల లోపు భూమి కలిగిన రైతులు 56 వేల మందికి పైగా ఉండగా, రెండు నుంచి ఐదెకరాలు కలిగిన వారు 70 వేలకు అటు ఇటుగా ఉన్నారు. చిన్న, సన్నకారు రైతులు పెట్టుబడి మొదలు ధాన్యం అమ్మేవరకు ప్రతీ చోట ఇబ్బందులే ఎదుర్కొంటున్నారు. పెట్టుబడి సాయం పేరిట ముందుగానే ప్రైవేటు వ్యాపారులు గ్రామాల్లో వాలిపోయి వీరిని తమ గుప్పిట్లోకి తెచ్చుకుంటున్నారు. ఈ రైతులతో పాటు అప్పు తీసుకోకుండా సాగు చేసిన రైతులకు సైతం ధాన్యం కోయడం నుంచి అమ్మడం వరకు అదనపు ఖర్చులు అవుతుండడంతో గత్యంతరం లేక ప్రైవేటు వ్యాపారులు, దళారులకే పంట అమ్మేసుకుంటున్నారు. ఫలితంగా బోనస్ మాట దేవుడెరుగు.. కనీసం మద్దతు ధర కూడా దక్కించుకోలేక శ్రమ దోపిడీకి గురవుతున్నారు. మరోవైపు రైతులు కష్టించి పండించిన ధాన్యం కారుచౌకగా ప్రైవేటు వ్యాపారుల పరం అవుతోంది.

సర్దుబాటు దందా..

ప్రభుత్వ నిబంధనల మేరకు ఒక ఎకరానికి 28 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేయొచ్చు. నేల స్వభావం, నీటి వసతి ఉన్న చోట 30 క్వింటాళ్లకు పైగా దిగుబడి సాధించే రైతులు కూడా ఉన్నారు. అయితే జిల్లా సగటు దిగుబడిని పరిగణనలోకి తీసుకుంటే ఎకరానికి 21 క్వింటాళ్ల వరకే దిగుబడి వస్తోంది. అంటే ప్రతీ ఎకరా మీద సగటున ఏడు క్వింటాళ్ల వరకు మిగులు కనిపిస్తోంది. ఇలా ఒక కేంద్రంలో ఒక రోజు మిగులుగా వచ్చే మొత్తాన్ని ప్రైవేటు వ్యాపారుల దగ్గరున్న ధాన్యంతో రికార్డుల్లో సర్దుబాటు చేస్తున్నారు. ప్రతీ ఐదు వేల ఎకరాలకు ఒక కొనుగోలు కేంద్రం చొప్పున ఉండడంతో స్థానిక రైతులతో ఉండే సంబంధాలను ఆసరాగా చేసుకుని ఈ దందా నిరాటంకంగా కొనసాగిస్తున్నారు. దీంతో చెమటోడ్చిన రైతులకు దక్కాల్సిన ప్రభుత్వ సాయం వ్యాపారుల పరం అవుతోంది. ఈ దందాకు సహకరించిన వారికీ తగిన ఫలితం దక్కుతోంది.

తనిఖీలు కరువు..

ప్రస్తుతం ధాన్యం కొనుగోళ్లలో సాగుతున్న మోసమే నిన్నా మొన్నటి వరకు పత్తి విషయంలోనూ జరిగింది. ఏళ్ల తరబడి ఈ అవినీతి తంతు కొనసాగుతున్నా అడ్డుకునే వారు కరువయ్యారు. ఫిర్యాదులు రాలేదనే సాకుతో రైతుల కష్టానికి ఫలితం దక్కకుండా చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాల్లో కనీస తనిఖీలు చేయడం లేదు. తేమ శాతంపై అధికారులు పెట్టే శ్రద్ధలో నాలుగో వంతైనా ఇలాంటి అక్రమ వ్యవహారాల మీద పెడితే రైతు కష్టానికి తగ్గ ఫలితం దక్కే అవకాశం ఉంటుంది.

కొను'గోల్‌మాల్'..

జిల్లా వ్యాప్తంగా మూడు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేయగా.. ఈ ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు 20 మండలాల పరిధిలో 160 కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. వివిధ వ్యవసాయ మార్కెట్లకు అనుబంధంగా ఉన్న ప్రాథమిక సహకార సంఘాల ఆధ్వర్యంలో ఈ కొనుగోళ్ల ప్రక్రియ జరుగుతోంది. పట్టదారు పాసు పుస్తకాలు చూపించి ఇక్కడ ధాన్యాన్ని అమ్ముకోవచ్చు. అయితే రైతుల వద్ద తక్కువ ధరకే కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఈ కేంద్రాల్లో అమ్మడం ద్వారా మద్దతు ధరతో పాటు అదనంగా బోనస్ కూడా ప్రైవేటు వ్యాపారులకే దక్కుతోంది. వ్యవసాయ శాఖ జారీ చేసే ఎన్‌డీఎస్ (నాన్ డిజిటల్ సైన్) కూపన్లను దుర్వినియోగం చేస్తూ వ్యాపారులు, దళారులు అమ్మకాలు సాగిస్తున్నారు. అయితే భారీగా సేకరించే ధాన్యం మొత్తాన్ని కూపన్ల ద్వారానే అమ్మడం సాధ్యం కాదు. దీంతో కొనుగోలు కేంద్రాల్లో పని చేసే కొందరు సిబ్బంది సహకారంతో తమ పని కానిచ్చేస్తున్నారు.

అక్రమాల అడ్డుకట్టకు చర్యలు



జిల్లాలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకున్నాం. అక్రమాలు జరిగాయని తెలిస్తే మాకు సమాచారం అందించాలని రైతులను కోరుతున్నాం. ఆ వెంటనే ఆయా మండలాల డిప్యూటీ తహసీల్దార్లతో కలిసి విచారణ చేస్తాం. అక్రమాలు నిజమేనని తేలితే బాధ్యులపై చర్య తీసుకుంటాం. రైతులకు ఇబ్బంది కలుగకుండా కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేస్తున్నాం.

– రుక్మిణి, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి

విషవాయువుపై అవగాహన కల్పించండి

కలెక్టర్ జితేష్ వి పాటిల్



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్, పక్కన జీఎం శర్మ, అధికారులు

అశ్వాపురం: భారజలం ఉత్పత్తి ప్రక్రియలో విషవాయువు హైడ్రోజన్ సల్ఫైడ్ విడుదలైనప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమీప గ్రామాల ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. మండల కేంద్రంలోని గౌతమీ నగర్ కాలనీలో గల పర్ణశాల అతిథి గృహంలో బుధవారం జీఎం హెచ్‌కే.శర్మ అధ్యక్షతన భారజల కర్మాగారం ఆఫ్‌సైట్ ఎమర్జెన్సీ సబ్‌ప్లాన్ సమీక్ష నిర్వహించారు. సమావేశానికి ఆఫ్‌సైట్ ఎమర్జెన్సీ చైర్మన్, కలెక్టర్ జితేష్ వి పాటిల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా.. ప్రమాదవశాత్తు విషవాయువు విడుదలైతే భారజల కర్మాగారం రక్షణ పరిధిలోని గ్రామాల్లో యాజమాన్యం చేపడుతున్న చర్యలు, ముందు జాగ్రత్తగా చేపట్టే కార్యక్రమాల గురించి కర్మాగారం అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. యాజమాన్యం చేపడుతున్న చర్యలపై సంతృప్తి వ్యక్తం చేసిన కలెక్టర్ మాట్లాడుతూ.. అన్ని శాఖల అధికారులు, మీడియా సహకారంతో విస్తృత ప్రచారం నిర్వహించాలని, ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఆ తర్వాత అధికారులు మాక్ డ్రిల్ నిర్వహించారు. సమావేశంలో భారజల కర్మాగారం డీజీఎం జి.శ్రీనివాసరావు, సీఏఓ వేణు, మెడికల్ సూపరింటెండెంట్ విజయ్‌కుమార్, సేఫ్టీ మేనేజర్ యోహాన్, రఫీక్ అహ్మద్, ఐఆర్ఓ లత, సీఐ అశోక్‌రెడ్డి, తహసీల్దార్ స్వర్ణలత, ఎంపీడీఓ వరప్రసాద్, ప్రభుత్వ వైద్యాధికారి సంకీర్తన పాల్గొన్నారు.

యాప్ సర్వే పారదర్శకంగా నిర్వహించాలి

జెడ్పీ సీఈఓ నాగలక్ష్మి



మొబైల్ యాప్ సర్వేను పరిశీలిస్తున్న సీఈఓ

బూర్గంపాడు: ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కోసం అధికారులు మొబైల్ యాప్ సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని జెడ్పీ సీఈఓ నాగలక్ష్మి సూచించారు. మండలంలోని నాగినేనిప్రోలు రెడ్డిపాలెం గ్రామంలో చేపట్టిన సర్వేను బుధవారం ఆమె పరిశీలించారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతీ ఇంటిని పరిశీలించి మొబైల్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. అనంతరం గ్రామంలోని నర్సరీని పరిశీలించారు. మొక్కలకు రోజూ నీరు పెడుతూ జాగ్రత్తగా కాపాడాలని సిబ్బందిని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించి చిన్నారులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జమలారెడ్డి, ఎంపీఓ సునీల్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న మల్టీజోనల్ అధికారి అలివేలు

పాల్వంచ: లక్ష్మీదేవిపల్లిలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర కళాశాలలో ఈనెల 19 నుంచి 21 వరకు జరిగే రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలను విజయవంతం చేయాలని మల్టీజోనల్ అధికారి కె.అలివేలు, జోనల్ అధికారి కె.స్వరూపరాణి అన్నారు. బుధవారం స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో నిర్వహించిన సమన్వయ సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ పోటీలు నిర్వహిస్తోందని, రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 1,400 మంది విద్యార్థులు హాజరవుతారని తెలిపారు. వారికి ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేయాలని సిబ్బందికి సూచించారు. పోటీల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హాజరవుతారని తెలిపారు. అనంతరం క్రీడల నిర్వహణ కమిటీలు వేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పీవీఎన్.పాపారావు, శ్రీలత, విజయ దుర్గ, పద్మావతి, నాగేశ్వరరావు, స్వరూప రాణి, మిథిల, సునీత తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో తొమ్మిది మందికి ఉద్యోగాలు



అభ్యర్థులతో మాట్లాడుతున్న శ్రీరామ్

సింగరేణి(కొత్తగూడెం): హైదరాబాద్‌లోని హెటీరో నెక్సిటీ కంపెనీలో ఖాళీగా ఉన్న 150 పోస్టుల భర్తీకి బుధవారం జిల్లాకు చెందిన యువతకు ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు జిల్లా ఉపాధి కల్పన శాఖాధికారి కొండపల్లి శ్రీరామ్ తెలిపారు. కొత్తగూడెం ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన ఇంటర్వ్యూలకు 32 మంది అభ్యర్థులు హాజరుకాగా, వారిలో తొమ్మి ది మందిని ఎంపిక చేసినట్లు చెప్పారు. ఆయా అభ్యర్థులకు కంపెనీ నిర్వాహకులు నియామకపత్రాలు అందజేస్తారని వివరించారు.

మెడికల్ బోర్డులో 123 మంది ఇన్‌వాలిడేషన్

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెంలోని సింగరేణి ప్రధానాస్పత్రిలో మంగళ, బుధవారాల్లో జరిగిన మెడికల్ బోర్డ్‌లో 123 మంది ఇన్‌వాలిడేషన్ అయినట్లు యాజమాన్యం ప్రకటించింది. సింగరేణి వ్యాప్తంగా ఉన్న 11 ఏరియాల్లోని 193 మందిని మెడికల్ బోర్డ్‌కు పిలవగా 160 మంది హాజరయ్యారు. వారిలో 123 మంది మెడికల్ ఇన్‌వాలిడేషన్ కాగా, మిగిలిన 37 మందిలో ఆరుగురు ఫిట్ ఫర్ సేమ్ జాబ్, 20 మంది హయ్యర్ రిఫరల్, 11 మంది ఫిట్‌ఫర్ సర్ఫేస్ జాబ్‌కు ఎంపికై నట్లు అధికారులు వివరించారు.

విద్యా సామర్థ్యాలు మెరుగుపరచాలి

ఐటీడీఏ పీఓ రాహుల్



బూర్గంపాడు : విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న రాహుల్

బూర్గంపాడు/గుండాల/ఇల్లెందురూరల్ : గిరిజన సంక్షేమ పాఠశాలల విద్యార్థుల సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ సూచించారు. విద్యార్థులకు అర్థమయ్యేలా బోధన చేపట్టాలన్నారు. ప్రాథమిక, ఆశ్రమ పాఠశాలల్లో వెనుకబడిన విద్యార్థుల కనీస సామర్థ్యాలను పెంచేందుకే ఉద్దీపకం వర్క్‌బుక్ విడుదల చేశామని చెప్పారు. బుధవారం ఆయన బూర్గంపాడు మండలం వేపలగడ్డ, ఇల్లెందు మండలం రొంపేడు, గుండాల మండలం కాచనపల్లి ఆశ్రమ పాఠశాలలను తనిఖీ చేశారు. విద్యార్థుల అభ్యాసన తీరును పరిశీలించారు. పిల్లలతో పాఠ్యాంశాలు చదివించి, బోర్డుపై రాయించారు. వర్క్‌బుక్‌లోని ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. అనంతరం మాట్లాడుతూ.. చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. ఆశ్రమ పాఠశాలల్లో సౌకర్యాలు, భోజనం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. ఉద్దీపనం వర్క్‌బుక్‌లోని పలు అంశాలను విద్యార్థులకు బోధించిన ఆయన కఠినమైన అంశాలను సులభంగా ఎలా నేర్చుకోవచ్చో అవగాహన కల్పించారు. ఇంగ్లిష్, గణితం సబ్జెక్టుల్లో సామర్థ్యాల పెంపునకు ఈ వర్క్‌బుక్ ఉపకరిస్తుందన్నారు. విద్యార్థులకు అర్థం కాని అంశాలను మరోసారి బోధించి ప్రాథమిక స్థాయిలోనే బలమైన పునాదులు వేయాలని సూచించారు. ఈ విషయంలో నిర్లక్ష్యం చేసిన ఉపాధ్యాయులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతీ రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యార్థులను చదివించడంతో పాటు రాయించాలని అన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఐటీడీఏ డీడీ మణెమ్మ, ఏటీడీఓ రాధమ్మ, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు భద్రు, సుభద్ర, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మెతో స్తంభించిన బోధన..

- ఎస్ఎస్ఏ ఉద్యోగుల ఆందోళనతో కేజీబీవీ విద్యార్థుల ఇక్కట్లు
- విద్యాశాఖలోనూ నిలుస్తున్న పలు రకాల పనులు
- ఆగిన ఆధార్ అప్‌డేట్, ఆన్‌లైన్ హాజరు నమోదు ప్రక్రియ

కొత్తగూడెంఅర్బన్ : తమను రెగ్యులర్ చేయాలంటూ జిల్లాలోని 650 మంది సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు రెండు రోజులుగా సమ్మె చేస్తున్నారు. అంతకుముందు నాలుగు రోజుల పాటు రోజుకు కొందరు చొప్పున నిరసన దీక్ష చేశారు. ఉద్యోగుల సమ్మెతో విద్యాశాఖలో పనులు నిలిచిపోతున్నాయి. ముఖ్యంగా కేజీబీవీల్లో పనిచేసే బోధన, బోధనేతర సిబ్బంది విధులు బహిష్కరించడంతో ఆయా విద్యాలయాల్లో తరగతుల నిర్వహణ ఆగిపోయింది. పదోతరగతి, ఇంటర్ విద్యార్థులకు ప్రస్తుత సమయం ఎంతో కీలకం. కొన్ని సబ్జెక్టుల సిలబస్ చివరి దశలో ఉండగా, మరి కొన్ని సబ్జెక్టులు ఇంకా చాలావరకు మిగిలింది. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. వార్షిక పరీక్షలకు సిద్ధం కావాల్సిన ఈ తరుణంలో ఉపాధ్యాయుల సమ్మెతో విద్యార్థులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని అంటున్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడమో లేదంటే వారి స్థానంలో ఇతర పాఠశాలల నుంచి డిప్యూటేషన్‌పై ఉపాధ్యాయులను కేజీబీవీలకు రప్పించడమో చేయాలని కోరుతున్నారు.

ఆగిన ఆధార్ అప్‌డేట్..

ప్రస్తుతం పలు పాఠశాలల్లో ఆన్‌లైన్‌లో హాజరు నమోదు, ఆధార్ అప్‌డేట్ ప్రక్రియలు కొనసాగుతున్నాయి. విద్యార్థులకు యూనిక్ ఐడీ జనరేట్ పనులు కూడా నడుస్తున్నాయి. ఈ పనులన్నీ సమగ్ర శిక్ష ఉద్యోగులే చేయాల్సి ఉండగా, సమ్మెతో స్తంభించిపోతున్నాయి. జిల్లా విద్యాశాఖలో ఏపీఓలుగా, కంప్యూటర్ ఆపరేటర్లుగా, సాంకేతిక ఉద్యోగులుగా, మేనేజర్లుగా, మండల స్థాయిలో ఎంఐఎస్ కో–ఆర్డినేటర్, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఐఈఆర్‌పీలుగా, స్కూల్ కాంప్లెక్స్ స్థాయిలో క్లస్టర్ రిసోర్స్ పర్సన్లుగా, పాఠశాల స్థాయిలో పీఈటీలు, కేజీబీవీ, యూఆర్ఎస్‌ల్లో ప్రత్యేకాధికారులుగా సమగ్ర శిక్ష ఉద్యోగులు పని చేస్తున్నారు. సమ్మెతో వీరంతా చేయాల్సిన పనులు నిలిచిపోతున్నాయి. ఇంకా ఏఎన్ఎంలు, అకౌంటెంట్లు, వంట మనుషులు, వాచ్‌మెన్స్, స్వీపర్లుగా కూడా దశాబ్దాలుగా విధులు నిర్వహిస్తున్నారు. అయినా వారిని నేటికీ క్రమబద్ధీకరించకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారు. కాగా, ఉద్యోగుల సమ్మెకు అన్ని ఉపాధ్యాయ సంఘాలు, ఇతర యూనియన్లు మద్దతు ప్రకటించాయి.



సమ్మె చేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

ప్రధాన డిమాండ్లు ఇవే..

- కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న తమను రెగ్యులర్ చేయాలి. అప్పటివరకు బేసిక్ పే ఇవ్వాలి
- ప్రతీ ఉద్యోగికి జీవిత బీమా రూ.10 లక్షలు, ఆరోగ్య బీమా రూ.10 లక్షల సౌకర్యం కల్పించాలి
- పీటీఏలకు ఎస్ఎస్ఏల వలే 12 నెలల వేతనం ఇవ్వాలి
- ఎస్ఎస్ఏలు ఉద్యోగ విరమణ చేస్తే బెనిఫిట్స్ కింద రూ.25 లక్షలు చెల్లించాలి

సమస్య పరిష్కరించే వరకూ ఉద్యమం

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు ఉద్యమిస్తాం. ఎన్నికల ముందు రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకుని మాకు న్యాయం చేయాలి. మా సమ్మెతో విద్యార్థులకు నష్టం వాటిల్లుతున్నా.. తప్పని పరిస్థితుల్లో మేం ఆందోళన చేయాల్సి వస్తోంది.

– భూక్యా మోహన్, సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు

విద్యార్థుల భోజనానికి ఇబ్బంది లేకుండా చూస్తున్నాం

సమగ్ర శిక్ష ఉద్యోగులు, ఉపాధ్యాయులు సమ్మెలో ఉండడంతో కేజీబీవీల్లో బోధనకు సమస్యలు తలెత్తున్నాయి. అయితే విద్యార్థుల భోజనానికి మాత్రం ఎలాంటి ఇబ్బంది రాకుండా చర్యలు తీసుకుంటున్నాం. దీంతో పాటు ఆధార్ అప్‌డేట్, విద్యార్థుల యూనిక్ ఐడీ ఎంట్రీ ప్రక్రియలకు కూడా ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

– ఎం.వెంకటేశ్వరాచారి, డీఈఓ

క్లుప్తంగా

పేద యువతికి సింగరేణి ఉద్యోగం


సాత్విక

చండ్రుగొండ : మద్దుకూరు గ్రామంలోని పేద కుటుంబానికి యువతి కొంగర సాత్విక సింగరేణి సంస్థలో జూనియర్ మైనింగ్ ఇంజినీర్ ట్రైనీగా ఉద్యోగం సాధించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఇటీవల నియామక పత్రాన్ని సాత్విక అందుకుంది. తండ్రి కొంగర కనకరాజు నాయీ బ్రాహ్మణ వృత్తి చేసుకుంటూ కుమార్తెను చదివించాడు. కాగా సాత్వికను గ్రామస్తులు అభినందించారు.

ఐదేళ్ల నిరీక్షణ ఫలించింది..

- సివిల్స్ ఇంటర్వ్యూకు ఎంపికైన సాయికుమార్


సాయికుమార్

ఏన్కూరు: ఆ యువకుడు ఐదేళ్లుగా సివిల్స్ సాధించడమే లక్ష్యంగా అహోరాత్రులు శ్రమిస్తున్నాడు. ఈ నేపథ్యాన ప్రిలిమ్స్, మెయిన్స్‌లో ఉత్తీర్ణత సాధించి ఇంటర్వ్యూకు ఎంపికవడం విశేషం. ఏన్కూరు మండలం అరికాయలపాడుకు చెందిన నల్లమల శ్రీనివాసరావు – అపర్ణ దంపతుల కుమారుడు సాయికుమార్ ఎస్సెస్సీ వరకు ఏన్కూరు జెడ్పీహెచ్‌ఎస్‌లో, ఇంటర్ విజయవాడ చైతన్య కళాశాలలో, ఇంజనీరింగ్ ఓయూలో పూర్తిచేశాడు. వీరి కుటుంబానికి ఎకరం పొలం ఉండగా తండ్రి కిరాణం షాపు నిర్వహిస్తున్నాడు. దీంతో పార్ట్‌టైం ఉద్యోగాలు చేస్తూనే ఐదేళ్లుగా సివిల్స్‌కు సిద్ధమవుతున్న ఆయన ఈసారి రెండు దశలు దాటి ఇంటర్వ్యూకు ఎంపికయ్యాడు. చిన్నప్పటి నుంచి సివిల్స్ లక్ష్యంగా ఎంచుకున్న సాయికుమార్ అడుగు దూరంలో ఉండగా విజయం సాధించాలని అరికాయలపాడు వాసులు ఆకాంక్షిస్తున్నారు.

బైక్ ఢీకొని చిన్నారికి గాయాలు

ఇల్లెందు: ఇంటి ముందు ఆడుకుంటున్న 9 ఏళ్ల చిన్నారిని బుధవారం బైక్ ఢీకొనడంతో గాయాలయ్యాయి. పట్టణంలోని 14 నంబర్ బస్తీ 15వ వార్డుకు చెందిన గణేష్ లోథ్ కుమార్తె యామిని ఆడుకుంటుండగా అదే ప్రాంతానికి చెందిన విష్ణు లోథ్ బైక్‌తో ఢీకొట్టాడు. దీంతో చిన్నారికి గాయాలయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ నాగుల్ మీరా ఖాన్ కేసు నమోదు చేశారు.

ముందస్తు అరెస్ట్

చలో హైదరాబాద్ కార్యక్రమం నేపథ్యంలో ఆరుగురు అంగన్‌వాడీ టీచర్లను బుధవారం ముందస్తుగా అరెస్ట్ చేశారు. ఈ మేరకు సీఐ సత్యనారాయణ వివరాలు వెల్లడించారు.

రేషన్ బియ్యం స్వాధీనం

తల్లాడ: మండలంలోని పాత మిట్టపల్లిలో బుధవారం పది క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఖమ్మం టాస్క్‌ఫోర్స్ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. గ్రామానికి చెందని మీర్జా జిలాన్ బేగ్ ఇంట్లో 20 సంచుల్లో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకోగా, తల్లాడ పోలీసులు విచారణ చేపట్టారు.

చెరువుమాదారంలో...

నేలకొండపల్లి: మండలంలోని చెరువుమాధారం గ్రామంలో ఓ ఇంట్లో నిల్వ ఉన్న పీడీఎస్ బియ్యాన్ని బుధవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పెద్దఎత్తున బియ్యం నిల్వలు ఉన్నాయనే సమాచారంతో తనిఖీ చేపట్టి స్వాధీనం చేసుకోగా, బియ్యాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అయితే, ఎంత మేర బియ్యం పట్టుబడిందనే వివరాలను పోలీసులు వెల్లడించలేదు.

వృద్ధురాలి ఆత్మహత్యాయత్నం


వృద్ధురాలు విజయలక్ష్మి

భద్రాచలంటౌన్: భద్రాచలం వద్ద బుధవారం గోదావరి నదిలో దూకి ఓ వృద్ధురాలు ఆత్మహత్యకు యత్నించగా, బోట్ నిర్వాహకులు కాపాడారు. స్థానికుల కథనం ప్రకారం.. సరిహద్దు ఏపీ కూనవరం మండలానికి చెందిన విజయలక్ష్మికి ఇద్దరు కుమారులు ఉన్నారు. తల్లిని సరిగా చూడకపోవడంతో జీవితంపై విరక్తితో భద్రాచలం వద్ద గోదావరి నదిలో దూకి చనిపోవాలని నిర్ణయించుకుంది. ఈ క్రమంలో గోదావరిలో దిగే సమయంలో బోటు నిర్వాహకుడు ప్రసాద్ గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. దీంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వృద్ధురాలిని స్టేషన్‌కు తరలించి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు.

బేకరీలో అగ్నిప్రమాదం

ఖమ్మంక్రైం: ఖమ్మం కస్బాబజార్‌లోని ఓ ప్రముఖ బేకరీలో బుధవారం అగ్నిప్రమాదం జరిగింది. వంటగది చిమ్నీ నుంచి ఆకస్మాత్తుగా మంటలు రావడంతో అప్రమత్తమైన సిబ్బంది అగ్నిమాపక శాఖ కార్యాలయానికి సమాచారం ఇచ్చారు. దీంతో ఎస్ఎఫ్ఓ నాగరాజు ఆధ్వర్యాన చేరుకున్న సిబ్బంది మంటలను అదుపు చేశారు. కాగా, బేకరీ చుట్టుపక్కల అన్నీ వ్యాపార దుకాణాలే ఉండటంతో తీవ్ర ఆందోళన నెలకొనగా.. మంటలు అదుపులోకి రావడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.20,413

కొలిక్కిరాని ఫుడ్‌కోర్టులు..!

- ఏళ్ల తరబడిగా నిరుపయోగంగా షెడ్లు
- వీధి వ్యాపారులకు కేటాయించాలని పలువురి విన్నపం


షెడ్లను సందర్శించి వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్ (ఫైల్)

కొత్తగూడెంఅర్బన్: పట్టణంలోని గాజులరాజం బస్తీలో జిల్లా ప్రభుత్వాస్పత్రిని ఆనుకుని నిర్మించిన షెడ్లను ఇటీవల కలెక్టర్ జితేష్ వి.పాటిల్ పరిశీలించారు. ఏళ్ల తరబడిగా ఎందుకు నిరుపయోగంగా ఉంచుతున్నారని అధికారులను ప్రశ్నించారు. షెడ్లలో మహిళా సంఘాలతో ఫుడ్‌కోర్టులు ఏర్పాటు చేయించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ ఇప్పటివరకు రెండుసార్లు పరిశీలించి అధికారులను ఆదేశించినా ఫుడ్‌కోర్టులు ఏర్పాటు చేయలేదు. అయితే ఫుడ్ కోర్టులు ఏర్పాటు చేస్తే అందులో వంటకాలు చేసే అవకాశం ఉండదు. వేరే చోట తయారు చేసి, తీసుకొచ్చి అమ్మకాలు చేయాల్సి ఉంటుంది. దీంతో తినుబండరాలు వేడి వేడిగా ఉండవని, విని యోగదారులు కొనుగోలుకు ఆసక్తి చూపరని పలువురు వ్యాపారులు పేర్కొంటున్నారు. దీనికితోడు నిర్వాహకులపై రవాణా భారం పడే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో మహిళా సంఘాలు కూడా ఫుడ్ కోర్టులకు వెనుకడుగు వేస్తున్నట్లు సమాచారం. కాగా దరఖాస్తులు వస్తే ఏర్పాటుకు చర్యలు చేపడతామని మెప్మా సిబ్బంది చెబుతున్నారు.

వీధి వ్యాపారులకు కేటాయిస్తే..

గాజులరాజంబస్తీలో జిల్లా ప్రధాన ఆస్పత్రి గోడకు ఆనుకుని ఆరేళ్ల క్రితం చిరువ్యాపారుల కోసం రూ.20 లక్షల మున్సిపల్ నిధులతో 15 రేకుల షెడ్లు నిర్మించారు. నిర్మాణం పూర్తయినా ఇప్పటివరకు వీధివ్యాపారులకు కేటాయించలేదు. మరోవైపు సింగరేణి మెయిన్ ఆస్పత్రి ఏరియా నుంచి బూడిద గడ్డ, హనుమాన్‌బస్తీ, గాజులరాజంబస్తీ ప్రజలంతా కూడా నిత్యావసరాలు, కూరగాయల కోసం సూపర్‌బజార్‌లోని రైతుబజార్‌కు వెళ్లాల్సి వస్తోంది. ఏళ్ల తరబడిగా నిరుపయోగంగా ఉన్న షెడ్ల దగ్గర ఫుడ్ కోర్టులు ఏర్పాటు చేయకపోతే వీధి వ్యాపారులకు కేటాయించాలని పలువురు కోరుతున్నారు. దీనివల్ల స్థానిక ప్రజలకు అన్ని రకాల వస్తువులు, కూరగాయలు కూడా అందుబాటులో దొరికే అవకాశం ఉంటుంది. మున్సిపాలిటీకి కూడా ఆదాయం వచ్చే అవకాశం ఉంటుంది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి షెడ్లను వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

చర్యలు చేపడుతున్నాం..

గాజులరాజంబస్తీలో నిర్మించిన షెడ్లలో ఫుడ్‌కోర్టులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఏర్పాటుకు మెప్మా సిబ్బంది చర్యలు తీసుకుంటున్నారు. త్వరితగతిన ప్రక్రియ పూర్తి చేస్తాం.

– శేషాంజన్‌స్వామి, కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్

రాత్రంతా యార్డులోనే చిన్నారులు

- ఆచూకీ తెలియక తల్లిదండ్రులు, బంధువుల ఆందోళన


పిల్లలతో సీఐ అశోక్‌రెడ్డి

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామానికి చెందిన పర్శిక ప్రసాద్(10), కావ్య(8), నాగశ్రీ(7) మంగళవారం ఉదయం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు వెళ్లారు. సాయంత్రం 4 గంటలకు పాఠశాల నుంచి ఇంటికి రాలేదు. పిల్లలు ఇంటి సమీపంలో ధాన్యం యార్డులో ఆడుకుని అక్కడే నిద్రపోయారు. రాత్రి వరకు పిల్లలు ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సీఐ అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్సై తిరుపతిరావు, సిబ్బంది, పిల్లల తల్లిదండ్రులు, మొండికుంట, మల్లెలమడుగు గ్రామాలకు చెందిన యువత రాత్రంతా పిల్లల కోసం వెతికారు. ఆచూకీ తెలియకపోవటంతో తల్లిదండ్రులు, బంధువులు ఆందోళన చెందారు. ఉదయం పిల్లలు ధాన్యం యార్డు సమీపంలో పడుకుని ఉండటాన్ని పోలీసులు, స్థానికులు గమనించి తల్లిదండ్రులకు అప్పగించారు. కాగా రాత్రంతా పిల్లల కోసం వెతికిన సీఐ అశోక్‌రెడ్డిని, సిబ్బందిని తల్లిదండ్రులు, స్థానికులు అభినందించారు.

గణిత పరీక్షలో విద్యార్థుల ప్రతిభ


బహుమతులు పొందిన విద్యార్థులతో విద్యాశాఖ అధికారులు

కొత్తగూడెంఅర్బన్: పాతకొత్తగూడెంలో పాఠశాలలో బుధవారం గణిత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రతి మండలం నుంచి ఆంగ్ల, తెలుగు మీడియాల నుంచి 136 మంది విద్యార్థులను ఎంపిక చేసి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన డీఈఓ వెంకటేశ్వరాచారి మాట్లాడుతూ పరీక్షలు విద్యార్థులకు గణితంపై ఆసక్తి పెరిగి భయం తొలగించేందుకు పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం విజేతలకు ప్రశంసా పత్రాలు, నగదు బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ ఏసీజీఈ మాధవరావు, ఎంఈఓ ప్రభుదయాళ్, టీఎంఎఫ్ గౌరవ అధ్యక్షుడు శ్రీనివాస్, ఏఎంఓ నాగరాజశేఖర్, ప్లానింగ్ కోఆర్డినేటర్ సతీష్ కుమార్, పాఠశాల హెచ్‌ఎం లక్ష్మి, టీఎంఎఫ్ రాష్ట్ర బాధ్యులు హరి, సీహెచ్ మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థులకు బంగారు భవిష్యత్

- ఉపాధ్యాయుల లక్ష్యం ఇదే కావాలి..
- పలు పాఠశాలల్లో తనిఖీ చేసిన ఐటీడీఏ పీఓ రాహుల్


తిరుమలాయపాలెం: మాదిరిపురం పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షిస్తున్న పీఓ రాహుల్

కారేపల్లి: గిరిజన విద్యార్థుల భవిష్యత్ బాగుండాలంటే పాఠశాలల ఉపాధ్యాయులు కీలకంగా వ్యవహరించాలని భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్ బి.రాహుల్ సూచించారు. కారేపల్లి మండలంలోని గాంధీనగర్ ట్రైబల్ వెల్ఫేర్ బాలుర గురుకుల పాఠశాల, కళాశాలను పీఓ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పదో తరగతి, ఇంటర్ విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించిన ఆయన వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై శ్రద్ధ కనబర్చాలని ప్రిన్సిపాల్, అధ్యాపకులకు సూచించారు. అలాగే, ఆహారంలో నాణ్యత లోపించకుండా మెనూ అమలు చేయాలని, సామగ్రి సేకరణ, నిల్వ సమయాన జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ప్రిన్సిపాల్, డిప్యూటీ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయుల్లో రోజుకు ఇద్దరు చొప్పున భోజనం తిన్నాకే విద్యార్థులకు వడ్డించాలని ఆదేశించారు. అనంతరం భల్లునగర్ గిరిజన పాఠశాలను సందర్శించిన పీఓ అక్కడ విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. ఐటీడీఏ అందించిన ఉద్దీపకం వర్క్ బుక్స్ ద్వారా బోధన చేపట్టాలని సూచించారు. ట్రైబల్ వెల్ఫేర్ డీడీ విజయలక్ష్మి, గురుకులాల ఆర్‌సీఓ నాగార్జునరావు, ప్రిన్సిపాల్ హరికృష్ణ, డిప్యూటీ వార్డెన్ పాషా, అధ్యాపకుడు గామయ్య పాల్గొన్నారు.

ఖమ్మంరూరల్: మండలంలోని గొల్లగూడెం ఆశ్రమ బాలికల పాఠశాలను ఐటీడీఏ పీఓ రాహుల్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా, లేదా అని ఆరా తీశారు. అలాగే, విద్యార్థులతో ఉద్దీపకం పుస్తకాలను చదివించి సామర్థ్యాలను పరీక్షించారు. అనుకున్న సమయానికి సిలబస్ పూర్తిచేసి విద్యార్థులు వార్షిక పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించేలా అదనపు తరగతులు నిర్వహించాలని సూచించారు. ఆ తర్వాత విద్యార్థులతో కలిసి పీఓ మధ్యాహ్న భోజనం చేశారు. ఏటీడీఓలు జహీరుద్దీన్, సత్యవతి, ఏసీఎంఓ రాములు, ప్రధానోపాధ్యాయులు ప్రసాద్, హెచ్‌డబ్ల్యూఓ రమాకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తిరుమలాయపాలెం: విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని ఐటీడీఏ పీఓ రాహుల్ ఆదేశించారు. తిరుమ లాయపాలెం మండలంలోని మాదిరిపురం గిరిజన ఆశ్రమ గురుకుల పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సెస్సీ, ఆరో తరగతి విద్యార్థులతో మాట్లాడి వారికి అందిస్తున్న ఆహారం, బోధనపై ఆరాతీశారు. అలాగే, వివిధ సబ్జెక్టుల్లో ప్రశ్నలు వేస్తూ సమాధానాలు రాబట్టారు. అనంతరం వంట తయారీ గదిని పరిశీలించి నాణ్యతపై సూచనలు చేశారు. ప్రిన్సిపాల్ భాస్కర్, వైస్ ప్రిన్సిపాళ్లు జాను, అనిత, ఫిజికల్ డైరెక్టర్ లక్ష్మణ్, ఇన్‌చార్జ్ వార్డెన్ బాబు పాల్గొన్నారు.

సీసీఆర్‌టీకి మణుగూరు ఉపాధ్యాయులు


సెమినార్‌లో ఇతర రాష్ట్రాల ఉపాధ్యాయులతో కోటేశ్వరరావు, పరమయ్య

మణుగూరు టౌన్: కేంద్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో రాజస్తాన్ రాష్ట్రం ఉదయపూర్‌లో నిర్వహించిన సెంటర్ ఫర్ కల్చరల్ రిసోర్సెస్ అండ్ ట్రైనింగ్ (సీసీఆర్‌టీ)లో మణుగూరు ఉపాధ్యాయులు బుధవారం పాల్గొన్నారు. మొత్తం 14 రాష్ట్రాల నుంచి 84 మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు. 10 రోజులపాటు జరిగే ఈ కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా ఎనిమిది మంది ఉపాధ్యాయులు ఎంపిక కాగా, వారిలో జిల్లా మణుగూరు మండలానికి చెందిన ఉపాధ్యాయులు వుయ్యూరు కోటేశ్వరరావు, పరమయ్య ఉన్నారు. సెమినార్‌లో తెలంగాణ రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలను, ఔన్నత్యాన్ని వివరించనున్నట్లు ఉపాధ్యాయులు పేర్కొన్నారు. వీరి ఎంపిక పట్ల ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

హత్యాయత్నం కేసు నమోదు

అశ్వారావుపేటరూరల్: ఇంట్లో నిద్రిస్తున్న భార్యను హతమార్చేందుకు యత్నించిన భర్తపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు ఎస్సై టి.యయాతి రాజు కథనం ప్రకారం.. ఏపీలోని ఏలూరు జిల్లా గోపాలపురానికి చెందిన పెంద్ర రవి భార్య దుర్గ స్వగ్రామమైన అశ్వారావుపేట మండలం ఆసుపాక గ్రామానికి వచ్చి నివాసం ఉంటోంది. ఈ దంపతులకు ఇద్దరు సంతానం. భార్యపై అనుమానం తోపాటు కుటుంబ కలహాల నేపథ్యంలో కొంత కాలంగా భర్త వేరుగా ఉంటున్నాడు. అప్పుడప్పుడు వచ్చి మద్యం మత్తులో గొడవ పడేవాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి వచ్చిన రవి నిద్రిస్తున్న భార్యపై మంచం పట్టెతో నుదుటి, తలపై దాడి చేశాడు. దీంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితురాలు గట్టిగా కేకలు పెట్టడంతో కుటుంబీకులు మేల్కొని వచ్చేసరికి అక్కడి నుంచి పారిపోయాడు. ఆమెను ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించారు. పోలీసులకు ఫిర్యాదు చేయగా, నిందితుడిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సెల్‌ఫోన్లు రికవరీ.. అప్పగింత


ఫోన్లు అందుకున్న వారితో ఎస్పీ రోహిత్‌రాజు, పోలీసులు

కొత్తగూడెంఅర్బన్: జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అప్పగించారు. ఈ మేరకు ఎస్పీ రోహిత్‌రాజు బుధవారం వివరాలు వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా అందుకున్న ఫిర్యాదులతో మొబైల్ ఫోన్లను రికవరీ చేసినట్లు తెలిపారు. నెల రోజుల వ్యవధిలో 220 మంది ఫోన్లు రికవరీ చేసి బాధితులకు అప్పగించారు. సెల్‌ఫోన్ పోగొట్టుకున్నవారు సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలను కచ్చితంగా నమోదు చేస్తే పోలీసులు ట్రాక్ చేసి, స్వాధీనం చేసుకుంటారని తెలిపారు. ఈ సందర్భంగా సిబ్బందికి ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీసీఆర్బీ డీఎస్పీ మల్లయ్య స్వామి, ఐటీ సెల్ ఇన్‌చార్జి సీఐ నాగరాజురెడ్డి, ఐటీ సెల్ సభ్యులు విజయ్, రాజేష్, నవీన్, మహేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫోన్లు చోరీ

పాల్వంచ: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పరీక్ష రాసేందుకు వెళ్లిన అభ్యర్థి బ్యాగ్‌లో రెండు సెల్‌ఫోన్లు చోరీకి గురయ్యాయి. బాధితురాలి కథనం ప్రకారం.. ఈ నెల 10న వి.ప్రియాంక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పరీక్ష రాసేందుకు వెళ్లింది. అక్కడి సిబ్బంది సూచన మేరకు తన హ్యాండ్ బ్యాగ్‌ను పరీక్ష హాల్ ముందు పెట్టి లోపలికి వెళ్లి పరీక్ష రాసింది. పరీక్ష అనంతరం బయటకు వచ్చి చూడగా బ్యాగ్ ఓపెన్ చేసి ఉంది. బ్యాగ్‌లోని రూ.లక్ష విలువ చేసే రెండు సెల్‌ఫోన్లు చోరీకి గురయ్యాయి. బాధితురాలు బుధవారం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. నాలుగు రోజుల క్రితం అక్కడ ఓ మోటార్ సైకిల్ ముందు బ్యాగ్‌లో ఉంచిన ఫోన్లు సైతం చోరీ అయినట్లు సమాచారం.

కేపీయూజీలో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం

మణుగూరుటౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని కొండాపురం భూగర్భ గనిలో ఐదు రోజుల నుంచి నీటి నిల్వలు ఆకస్మికంగా పెరుగుతుండటంతో బొగ్గు వెలికితీతకు అంతరాయం ఏర్పడింది. ఈ నెల 6వ తేదీన నైట్ షిఫ్ట్ ముగింపు సమయం నుంచి 42 లెవల్ ఎం డిప్‌సైడ్ వద్ద ఉబికి వస్తున్న నీటి వల్ల బొగ్గు ఉత్పత్తికి తీవ్ర అంతరాయం ఏర్పడిందని అధికారులు చెబుతున్నారు. గనిలో చేరిన లక్ష గ్యాలన్ల నీటి నిల్వను తొలగించి ఉత్పత్తిని పునరుద్ధరించేందుకు ఏడు పంపులు ఏర్పాటు చేసినా పరిస్థితి అదుపులోకి రావడం లేదని తెలుస్తోంది. ఇప్పటివరకు సుమారు 1800 జీపీఎం నీటిని ఉపరితలానికి పంపింగ్ చేశారు. భూగర్భంలో భూమి పొరల నుంచి నీటి ప్రవాహం సర్వసాధారణమైనా ఐదు రోజులుగా ఉత్పత్తికి అంతరాయం ఏర్పడటం అధికారులు మిషన్లు, కార్మికులను ఉపరితలానికి తరలించి ఎమర్జెన్సీ ఆర్గనైజేషన్ ప్రకటించారు. ఆకస్మికంగా వచ్చిన నీటి ప్రవాహ పాయింట్‌ను తెలుసుకునేందుకు హైడ్రో జియోలజిస్టులు అన్వేషిస్తున్నారు. కాగా 2,500 టన్నుల బొగ్గు ఉత్పత్తికి ఆటంకం ఏర్పడిందని డీజీఎం(పర్సనల్) ఒక ప్రకటనలో తెలిపారు.

బంకర్‌ను ఢీకొట్టిన డీజిల్ ట్యాంకర్


కేసీహెచ్‌పీలో బంకర్ పోల్‌ను ఢీకొట్టిన డీజిల్ ట్యాంకర్

మణుగూరు టౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో త్రుటిలో పెనుప్రమాదం తప్పింది. 12 వేల లీటర్లతో ప్రయాణిస్తున్న డీజిల్ ట్యాంకర్ బుధవారం ఉదయం బంకర్‌ను ఢీకొట్టింది. వివరాలు ఇలా ఉన్నాయి. రోజూ మణుగూరులోని సింగరేణికి ఇతర ప్రాంతాల నుంచి డీజిల్ ట్యాంకర్‌లు వచ్చి ఏరియా స్టోర్స్ వద్ద దిగుమతి చేసి వెళ్తుంటాయి. అక్కడి నుంచి అవసరమైన గని ప్రదేశాలకు సింగరేణి డీజిల్ ట్యాంకర్ల ద్వారా తరలించుకుంటారు. ఈ క్రమంలో ఉదయం సమయంలో ఓసీ–4 వైపు నుంచి ఓసీ–2 కొత్త సైట్ ఆఫీస్ వైపు వెళ్తున్న సింగరేణి డీజిల్ ట్యాంకర్ కేసీహెచ్‌పీ మీదుగా వెళ్తూ సీ–21 వద్ద బంకర్‌ను ఢీ కొట్టింది. ఆ సమయంలో ట్యాంకర్‌లో దాదాపు 12 వేల లీటర్ల డీజిల్ ఉంది. త్రుటిలో పెను ప్రమాదం తప్పిందని అధికారులు, కార్మికులు ఊపిరి పీల్చుకుంటున్నారు. సంఘటనా స్థలాన్ని అధికారులు పరిశీలించారు. ఒకవైపు ఏరియాలో 55వ రక్షణ పక్షోత్సవాలు జరుగుతుండగా, మరోవైపు ప్రమాదం తప్పడం పట్ల వాహనం ఫిట్‌నెస్‌పై, రక్షణపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

టిప్పర్, వ్యాన్ ఢీ.. ఇద్దరికి గాయాలు


బ్రిడ్జి రెయిలింగ్‌ను ఢీకొని నిలిచిన డీసీఎం వ్యాన్

సత్తుపల్లిటౌన్: ఎదురెదురుగా వచ్చిన బొగ్గు టిప్పర్, డీసీఎం వ్యాన్ ఢీకొనటంతో ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన సత్తుపల్లిలో చోటుచేసుకుంది. మండలంలోని కిష్టారం ఓపెన్ కాస్ట్ నుంచి పెనుబల్లి వైపు వెళ్తున్న బొగ్గు టిప్పర్.. ఖమ్మం నుంచి సత్తుపల్లి వైపు ట్రావెలింగ్ బ్యాగ్‌ల లోడ్‌తో వస్తున్న డీసీఎం వ్యాన్.. బుధవారం ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ క్రమంలో వ్యాన్ దూసుకెళ్లి బ్రిడ్జి, చెట్టును ఢీకొని ఆగిపోయింది. వ్యాన్‌డ్రైవర్, ఏపీలోని కృష్ణా జిల్లా వత్సవాయికి చెందిన కె.రవి పక్కనే కాల్వలో పడగా ఆయన్ను కానిస్టేబుళ్లు ఇమ్రాన్, వంశీ, సుధాకర్ అతికష్టం మీద పైకి తీసుకొచ్చి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అలాగే, రుద్రంపూర్‌కు చెందిన బొగ్గు టిప్పర్ డ్రైవర్ శివకుమార్‌కు కూడా తీవ్ర గాయాలు కాగా ఆస్పత్రిలో చేర్పించి ప్రాథమిక చికిత్స అనంతరం ఇద్దరినీ ఖమ్మం తరలించారు. కాగా, సత్తుపల్లి – కిష్టారం మధ్య జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంతో ఇరువైపులా భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. దీంతో పోలీసులు గంట పాటు శ్రమించి రాకపోకలను క్రమబద్ధీకరించారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు సత్తుపల్లి సీఐ టి.కిరణ్ తెలిపారు.

పత్తి కౌంటర్లపై అధికారుల దాడులు


తనిఖీ చేస్తున్న మార్కెట్ కమిటీ అధికారులు

టేకులపల్లి: అనుమతులు లేకుండా పత్తి కొనుగోళ్లు చేస్తున్న చిల్లర కౌంటర్లపై ఇల్లెందు వ్యవసాయ మార్కెట్ కమిటీ అధికారులు బుధవారం రాత్రి దాడులు నిర్వహించారు. కొందరు వ్యాపారులు అడ్డగోలుగా తూకం వేయడం, బిల్లులు, రికార్డులు నిర్వహణ సరిగా లేకపోవడం, లైసెన్సులు, అనుమతులు తీసుకోకపోవడం, నకిలీ రిజిస్టర్లు, బిల్లు బుక్‌లు వంటి వాటిని గుర్తించి మందలించారు. జరిమానా విధించారు. 8 కౌంటర్ల నుంచి కాటాలను స్వాధీనం చేసుకున్నారు. కాగా కొందరు వ్యాపారులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. దాడుల్లో మార్కెట్ కమిటీ కార్యదర్శి నరేష్ కుమార్, సూపర్‌వైజర్ శ్రీనివాస్‌రావు, సిబ్బంది రంజిత్, మధు, శ్రీను, రమేష్, చందర్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

టేకులపల్లి: మండలంలోని గంగారం పంచాయతీ సిద్దారం నటరాజ ఆలయం సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి (45) బుధవారం మృతి చెందాడు. మృతి చెందిన వ్యక్తి భిక్షాటన చేసే వ్యక్తిలా ఉన్నాడని బోడు ఎస్‌ఐ పొడిశెట్టి శ్రీకాంత్ తెలిపారు. నలుపు, తెలుపు రంగు జుత్తు కలిగి ఉన్నాడని, నలుపు రంగు ప్యాంటు ధరించి ఉన్నాడని పేర్కొన్నారు. వివరాలు తెలిస్తే 87126 82077 నంబరులో సంప్రదించాలని కోరారు.

చెరువులో పడి వ్యక్తి ..

వేంసూరు: ప్రమాదవశాత్తు చెరువులో పడిన ఓ వ్యక్తి మృతి చెందగా బుధవారం మృతదేహం బయటపడింది. మండలంలోని భీమవరం గ్రామానికి చెందిన యమవరపు మారేశ్వరరావు (46) మంగళవారం ఉదయం కాలకృత్యాలు తీర్చుకునేందుకు స్థానిక చెరువు వద్దకు వెళ్లగా ప్రమాదవశాత్తు అందులో పడ్డాడు. స్థానికులు గాలించగా బుధవారం ఉదయం మృతదేహం బయటపడటంతో పోలీసులకు కుటుంబీకులు సమాచారం ఇచ్చారు. మృతుడి కుమారుడు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ సత్యం తెలిపారు.

చికిత్స పొందుతున్న యువకుడు..

నేలకొండపల్లి: పురుగులమందు తాగిన ఓ యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. మండలంలోని కోనాయిగూడెంనకు చెందిన కొలికపొంగు నాగరాజు (22) గత నెల 22న పురుగులమందు తాగగా కుటుంబీకులు ఖమ్మంలో చికిత్స అనంతరం హైదరాబాద్ తరలించారు. అక్కడ చికిత్స అందిస్తుండగా బుధవారం మృతి చెందాడు.

పోలీసులకు చిక్కిన హత్య కేసు నిందితులు?

నేలకొండపల్లి: మండల కేంద్రానికి చెందిన దంపతులు ఎర్రా వెంకటరమణ – కృష్ణకుమారి హత్య కేసులో పోలీసులు పురోగతి సాధించినట్లు తెలిసింది. గత నెల 27న దంపతుల హత్య జరిగిన విషయం తెలిసిందే. పోలీసులు సవాల్‌గా తీసుకుని ప్రత్యేక బృందాలుగా ఏర్పడి విచారణ చేపట్టారు. ఇందులో భాగంగా సీసీ పుటేజీలు, కాల్ డేటా ఆధారంగా నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. కానీ, ఈ విషయాన్ని పోలీసులు మాత్రం ధ్రువీకరించలేదు. అయితే, గురువారం లేదా శుక్రవారం మీడియా సమావేశంలో వివరాలను జిల్లా అధికారులు వెల్లడించనున్నట్లు సమాచారం.

10 వేల మంది అయ్యప్పస్వాముల గిరి ప్రదక్షిణ

ఆలయ చరిత్రలోనే మొదటిసారి


యాదగిరి కొండ చుట్టూ గిరి ప్రదక్షిణ చేస్తున్న అయ్యప్ప స్వాములు

యాదగిరిగుట్ట: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో బుధవారం అయ్యప్ప మాలధారణ స్వాముల సందడి నెలకొంది. ఏకాదశి, గీత జయంతిని పురస్కరించుకొని స్థానిక అయ్యప్ప స్వాములతో పాటు తెలంగాణ నలుమూలలు, వివిధ రాష్ట్రాలకు చెందిన 10 వేల మందికి పైగా మాలధారణ స్వాములు శ్రీస్వామి వారి కొండ చుట్టూ గిరిప్రదక్షిణ చేపట్టారు. అయ్యప్ప మాలధారణ స్వాములు ఇంత పెద్దఎత్తున గిరి ప్రదక్షిణ చేయడం ఆలయ చరిత్రలో ఇదే మొదటిసారి. మంగళవారం రాత్రి నుంచే పలు జిల్లాలు, రాష్ట్రాల నుంచి అయ్యప్ప మాలధారణ స్వాములు యాదగిరిగుట్టకు చేరుకున్నారు. వేకువ జామునే వైకుంఠద్వారం వద్దకు అయ్యప్పలు భారీగా చేరుకొని శ్రీలక్ష్మీనరసింహస్వామికి, పల్లకిలో అధిష్ఠించిన అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఈఓ భాస్కర్‌రావు ప్రత్యేక పూజలు చేసి, గిరి ప్రదక్షిణను ప్రారంభించారు. గిరి ప్రదక్షిణ మార్గమంతా అయ్యప్ప మాలధారణ స్వాములతో నిండిపోయింది. నారసింహుడు, అయ్యప్ప నామ స్మరణలతో అధ్యాత్మికతను సంతరించుకొంది. గిరి ప్రదక్షిణ పూర్తి చేసుకున్న మాలధారణ స్వాములంతా మెట్ల మార్గంలో కొండపైకి చేరుకున్న తర్వాత.. రూ.150 వీఐపీ దర్శనం మార్గంలో ప్రధానాలయంలోకి వెళ్లి గర్భాలయంలో స్వయంభూలను దర్శించుకున్నారు. గిరి ప్రదక్షిణలో పాల్గొని, శ్రీస్వామిని దర్శించుకున్న మాలధారణ స్వాములకు భాస్కర్‌రావు ప్రత్యేక ప్రసాదాన్ని అందజేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆలయ పరిసరాల్లో ఎటు చూసినా అయ్యప్ప మాలధారణ స్వాములే కనిపించారు.

'ఫ్రెండ్లీ మహిళ'కు జాతీయ పురస్కారం

- దేశంలోనే ఉత్తమ పంచాయతీగా చిల్లపల్లి
- రాష్ట్రపతి నుంచి అవార్డు అందుకున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష


రాష్ట్రపతి చేతుల మీదుగా జాతీయ స్థాయి అవార్డు అందుకుంటున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

మంథని: పెద్దపల్లి జిల్లా మంథని మండలం చిల్లపల్లి గ్రామానికి చెందిన మహిళా సంఘం సభ్యుల పనితీరుకు జాతీయస్థాయి పురస్కారం లభించింది. ఫ్రెండ్లీ ఉమెన్ విభాగంలో జాతీయ స్థాయిలో చిల్లపల్లి ఉత్తమ పంచాయతీగా ఎంపికవడంతో కలెక్టర్ కోయ శ్రీహర్ష బుధవారం న్యూఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. కలెక్టర్‌తోపాటు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె.అరుణశ్రీ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. 2022–23 సంవత్సరంలో మహిళా ఫ్రెండ్లీ పంచాయతీల్లో చిల్లపల్లి గ్రామం దేశంలోనే గుర్తింపు పొందింది.

పనితీరుకు పట్టం..

చిల్లపల్లి గ్రామంలోని ఆరేళ్ల వయసుగల పిల్లలందరినీ ఐసీడీఎస్‌లో నమోదు చేయడం, గ్రామసభల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొనడం, స్వశక్తి మహిళా సంఘాలకు రుణాలు మంజూరు చేయించడం, మాతాశిశు మరణాల శాతం తగ్గడం, బాలికల విద్యకు ప్రోత్సాహం అందించడం తదితర కార్యక్రమాలు అమలు చేయడంలో చిల్లపల్లి గ్రామ మహిళలు అగ్రస్థానంలో నిలిచారు. దీంతో మహిళా ఫ్రెండ్లీ గ్రామంగా ఎంపికైన చిల్లపల్లికి రూ.65 లక్షల నగదు బహుమతి లభించింది. కాగా, ఈ నిధులను గ్రామాభివృద్ధికే వెచ్చిస్తామని కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. భవిష్యత్‌లోనూ ఇదే స్ఫూర్తితో మహిళల అభ్యున్నతి కోసం పనులు చేపట్టాలని ఆయన ఆకాంక్షించారు.

భారత్ గౌరవ్ అయోధ్య- కాశీ
యాత్ర రైలు ప్రారంభం



సాక్షి, సిటీబ్యూరో: భారత్‌గౌరవ్ 'అయోధ్య – కాశీ పుణ్య క్షేత్ర యాత్ర' 26వ టూరిస్ట్ రైలు బుధవారం సికింద్రాబాద్ స్టేషన్ నుంచి ప్రారంభమైంది. యాత్రకు బయలుదేరిన ప్రయాణికుల్లోని డాక్టర్ టి. విఠల్‌రెడ్డి, టి.కుసుమలు ఈ రైలును ప్రారంభించారు. ఐఆర్‌సీటీసీ జనరల్ మేనేజర్ రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అయోధ్య – కాశీ పుణ్యక్షేత్ర యాత్రలో భాగంగా యాత్రికులు గయ, వారణాసి, అయోధ్య, ప్రయాగ్ రాజ్‌లలోని దివ్య క్షేత్రాలను సందర్శించనున్నారు. ఈ నెల 20 వరకు ఈ పర్యటన కొనసాగనుంది. భారత్ గౌరవ్ టూరిస్ట్ రైళ్లకు ప్రయాణికుల నుంచి అనూహ్య స్పందన లభిస్తోందని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ హర్షం వ్యక్తం చేశారు.

త్వరలో మహా కుంభ పుణ్యక్షేత్ర యాత్ర..

ఐఆర్‌సీటీసీ మహాకుంభ పుణ్యక్షేత్ర యాత్ర పేరిట త్వరలో మరో భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలును అందుబాటులోకి తేనుంది. పూర్తి వివరాలకు ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్ http://www.irctctourism. comను సందర్శించవచ్చు, లేదా 040- 27702407, 9701360701లను సంప్రదించవచ్చు.



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

ప్రజాగ్రహం వల్లే
డైవర్షన్ పాలిటిక్స్

వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మండిపాటు

- చంద్రబాబు అబద్ధాలు మోసాలుగా మారాయి
- అవే ప్రజల్లో కోపంగా మారుతున్నాయి
- మా పథకాలెందుకు ఇవ్వట్లేదని ప్రజలు నిలదీస్తున్నారు
- ప్రజలకు సమాధానం చెప్పలేకే ప్రతి నెలా ఏదో ఒక అంశంపై గోబెల్స్ ప్రచారం

సాక్షి, అమరావతి: 'ప్రజలకు అబద్ధాలు చెబితే అది మోసం అవుతుంది. అది ప్రజల్లో కోపం కింద మారుతుంది. ఆ కోపమే చంద్రబాబు పాలనపై ప్రజల్లో ఇప్పుడు విపరీతంగా కనిపిస్తోంది' అని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారు. సూపర్ సిక్స్ సహా ఎన్నికల హామీల అమలు ఏమైందని ప్రజలు నిలదీస్తుండటంతో సమాధానం చెప్పలేని టీడీపీ పెద్దలు డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతున్నారని దెప్పి పొడిచారు. 'జూన్‌లో రుషికొండ భవనాలు అని, జూలైలో శ్వేతపత్రాలు అని, మదనపల్లె ఫైల్స్ అని, ఆగస్టులో ముంబై నటి కాదంబరి జెత్వానీ అని, సెప్టెంబర్‌లో ప్రకాశం బ్యారేజీని బోట్లతో ఢీకొట్టి కూలగొట్టాలన్న కుట్ర చేశామని, అక్టోబర్‌లో నా కుటుంబాన్ని తెచ్చి, నవంబర్‌లో బడ్జెట్‌పై దృష్టి మరలించడానికి రూ.14 లక్షల కోట్లు అప్పు అని డైవర్షన్ చేశారు. ఇప్పుడు డిసెంబర్‌లో రేషన్ బియ్యం అక్రమ రవాణా అంటూ నానా హంగామా చేస్తూ, దుష్ప్రచారం చేస్తున్నారు'అని ఎత్తి చూపారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన ఉమ్మడి ప్రకాశం జిల్లా పార్టీ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, నేతలతో సమావేశమై.. భవిష్యత్ కార్యాచరణపై వారికి దిశా నిర్దేశం చేశారు. నిత్యం ప్రజలతో మమేకమవుతూ.. వారి పక్షాన ప్రభుత్వంపై పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు. 'యుద్ధం గతంలోలా లేదు. మనం చంద్రబాబుతోనే యుద్ధం చేయడం లేదు. ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ5, ఎల్లో మీడియాతోనూ పోరాటం చేస్తున్నాం. వీటికి తోడు చెడిపోయిన ఐ–టీడీపీతో యుద్ధం చేస్తున్నాం. వీరంతా నిత్యం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు. వీళ్లు ప్రజలకు చేసిన మంచి చెప్పుకోవడానికి ఏమీ లేదు. బురద జల్లడమే పనిగా పెట్టుకున్న వారితో మనం యుద్ధం చేస్తున్నాం. అబద్ధాలు చెప్పడం, వక్రీకరణ చేయడం, దుష్ప్రచారం చేయడాన్ని ఒక పనిగా పెట్టుకున్నారు. దీన్ని తిప్పికొట్టాల్సిన అవసరం ఉంది'అని నేతలకు ఉద్బోధించారు. 'ప్రతి ఒక్కరికీ సోషల్ మీడియా ఎక్కౌంట్ ఉండాలి. అన్యాయం జరిగితే దాన్ని కచ్చితంగా ప్రశ్నించాలి. ఎక్కడ అన్యాయం జరిగినా ఫోటో తీసి ప్రశ్నించాలి. ఎందుకు అమ్మఒడి రావడం లేదు? మా విలేజ్ క్లినిక్ పరిస్థితి ఎందుకు ఇంత దారుణంగా ఉంది? ఇలా అన్ని సమస్యలపై ఫోటోలు తీసి అప్ లోడ్ చేయాలి. తద్వారా ప్రజలకు దగ్గర కావాలి'అంటూ నేతలకు దిశా నిర్దేశం చేశారు. 'ఎన్నికలు అయిపోయి ఆరు నెలలు దాటింది. ఈ పరిస్థితుల్లో పార్టీని మనం మళ్లీ సమాయత్తం చేసే దిశగా అడుగులు వేస్తూ ఇవాళ కలుస్తున్నాం. ఆరు నెలల్లో ఇంత వ్యతిరేకత ఈ స్థాయిలో ఏ ప్రభుత్వం మీద లేదు. కేవలం చంద్రబాబునాయుడు పాలనలో మాత్రమే ఇలాంటి పరిస్థితి చూస్తున్నాం'అన్నారు. ఈ సమావేశంలో వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

చంద్రబాబు బాదుడే బాదుడు

ఈ డైవర్షన్ పాలిటిక్స్ మధ్య ఈరోజు మనం పార్టీ బలోపేతం చేయడంతో పాటు, ప్రజల తరఫున పోరాటం చేయడానికి సన్నద్ధం అయ్యాం. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలన్నీ నాశనమయ్యాయి. మరో వైపు బాదుడే బాదుడు. సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ లేవు. వ్యవస్థలన్నీ పూర్తిగా దిగజారిపోయాయి. కరెంటు బిల్లులు ముట్టుకుంటే షాక్ కొడుతున్నాయి. రూ.6 వేల కోట్ల బాదుడుతో మొదటి డోసు ఇది. నవంబరు, డిసెంబరు బిల్లులో ఏ ఇంటికి వెళ్లినా రూ.300 కనీసం తేడా కనిపిస్తోంది. రానున్న నెలలో మరో రూ.9 వేల కోట్ల భారం వేస్తున్నారు. ఊళ్లలో రోడ్డెక్కితే చాలు డబ్బు కట్టాల్సిందేనట.

పోరు బాట దిశగా అడుగులు

అందుకే మనందరం పోరుబాట పట్టాల్సిందే. ఈ నెల 13న అన్నదాతలకు అండగా సమస్యలపై కార్యక్రమం పెట్టాం. ఈనెల 27న కరెంటు చార్జీల మీద మరో కార్యక్రమం చేస్తున్నాం. జనవరి 3వ తేదీన ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం మరో కార్యక్రమం చేస్తున్నాం. అలాగే పార్టీని మనం మరింత బలోపేతం చేయాలి. దీన్ని వ్యవస్థీకృత విధానం (ఆర్గనైజ్డ్ స్ట్రక్చర్)లోకి తీసుకురావాలి. ఇందులో భాగంగా పార్టీలో క్రియాశీల మార్పులు తీసుకు వచ్చాం. సంక్రాంతి తర్వాత ప్రతి పార్లమెంట్ నియోజకవర్గంలో బుధ, గురువారాల్లో ఉంటాను. అవసరాన్ని బట్టి శుక్రవారం కూడా ఉండేలా ప్లాన్ చేస్తున్నాను. 'కార్యకర్తలతో జగనన్న.. పార్టీ బలోపేతానికి దిశా నిర్దేశం'పేరుతో ఈ కార్యక్రమంలో పాల్గొంటాను. నా కార్యక్రమం ప్రారంభమయ్యేలోపు జిల్లా కమిటీలు, నియోజకవర్గ కమిటీలు, మండల స్థాయి కమిటీలు పూర్తి చేయాలి. సంక్రాంతి లోపే అవన్నీ పూర్తి కావాలి. నా కార్యక్రమం మొదలైన తర్వాత మండల స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు కమిటీలు పూర్తి చేద్దాం.

జిల్లా వార్తలు

ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ

జూలూరుపాడు: ఐటీసీ పరిధిలోని ప్రథమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఆధ్వర్యాన నిరుద్యోగులకు ఉపాధి రంగాల్లో ఉచిత శిక్షణ ఇచ్చి ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కోఆర్డినేటర్ ఎస్.వెంకట్రామ్ తెలిపారు. 18నుంచి 35ఏళ్ల వయస్సు కలిగి ఎనిమిదో తరగతి మొదలు డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా అర్హత ఉన్న అభ్యర్థులు అర్హులని వెల్లడించారు. ఎలక్ట్రీషియన్ కోర్సు బూర్గంపాడులో, హోటల్ మేనేజ్‌మెంట్, మెకానికల్, నర్సింగ్ కోర్సుల్లో శిక్షణ భద్రాచలంలో ఉంటుందని తెలిపారు. ఆసక్తి, అర్హతలు ఉన్న వారు 91776 41543 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

22న 'సత్యహరిశ్చంద్ర' పోటీలు

మధిర: స్వాతంత్ర్య సమరయోధుడు, సత్యహరిశ్చంద్ర నాటక రచయిత బలిజేపల్లి లక్ష్మీకాంత కవి జయంతి సందర్భంగా జిల్లాస్థాయిలో విద్యార్థులకు సత్యహరిశ్చంద్ర నాటక పద్య పఠన పోటీలు నిర్వహిస్తున్నట్లు సుమిత్ర యూత్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ నిభానుపూడి సుబ్బరాజు తెలిపారు. సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో ఈ నెల 22వ తేదీన ఈ పోటీలు ఉంటాయని వెల్లడించారు. ఒక్కో విభాగంలో ప్రతీ పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థులే పాల్గొనాలని కోరారు. ఎంపిక చేసిన పద్యాల వివరాలు, పేర్ల నమోదు కోసం 94404 66522 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

రద్దీకి అనుగుణంగా బస్సు సర్వీసులు

ఖమ్మంమయూరిసెంటర్/ఇల్లెందు: ఖమ్మం నుంచి ఇల్లెందుకు ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులు నడిపిస్తున్నట్లు డిపో మేనేజర్ దినేశ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రద్దీ ఎక్కువగా ఉండే సమయాన ప్రతీ 15, 20 నిమిషాలకు ఒక ఎక్స్‌ప్రెస్, రద్దీ తక్కువగా ఉండే సమయాల్లో ప్రతీ అర గంటకు ఒక బస్సు ఏర్పాటు చేశామని వెల్లడించారు. ఉదయం 5.30 గంటల నుంచి రాత్రి 9.30 గంటల వరకు ఈ బస్సులు రాకపోకలు సాగిస్తాయని పేర్కొన్నారు. ఇల్లెందు రూట్‌లో ప్రయాణించే వారు ఈ సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వేతనాలు సరే... శిక్షణ మాటేమిటి?



ట్రాక్టర్‌లో చెత్త వేస్తున్న మల్టీపర్పస్ వర్కర్లు

- జీపీల్లో మల్టీపర్పస్ విధానంతో కార్మికుల్లో అభద్రత
- శిక్షణ లేక ప్రమాదాల బారిన సిబ్బంది
- పని విధానంలో మార్పులు, శిక్షణ కోరుతున్న కార్మికులు

ఇల్లెందురూరల్: గ్రామపంచాయతీ వ్యవస్థ ప్రక్షాళనలో భాగంగా గత ప్రభుత్వం అమలుచేసిన విధానాలతో జీపీలు కొంత మేర అభివృద్ధి సాధించాయి. ఇదేసమయాన మల్టీపర్పస్ పేరుతో అన్ని పనులు చేసేలా కార్మికులకు బాధ్యతలు అప్పగించడం విమర్శలకు తావిచ్చింది. నాడు కార్మికుల నియామక ప్రక్రియలో అవలంభించిన విధానం ఇప్పుడు వారిని శాపంగా వెంటాడుతూనే ఉంది. ఇటీవల అకౌంట్లలో వేతనాలు జమ చేయాలని నిర్ణయించడంపై హర్షం వ్యక్తమవుతున్నా కార్మికులకు నైపుణ్య శిక్షణ కూడా ఇప్పించాలనే డిమాండ్ వస్తోంది.

మల్టీపర్పస్ విధానం పేరుతో..

గ్రామపంచాయతీలలో కార్మికుల నియామకం చేపట్టిన గత ప్రభుత్వం వారికి మల్టీపర్పస్ వర్కర్‌గా పేరు పెట్టింది. దీంతో పంచాయతీల్లో అన్ని పనులు చేయాల్సిన బాధ్యత వారికి అప్పగించినట్లయింది. మల్టీపర్పస్ పేరుతో నియమితులైన కార్మికులు వీధులు, డ్రెయినేజీలు శుభ్రం చేయడం, చెత్త తొలగించడం, బ్లీచింగ్ పౌడర్ చల్లడం వంటి పారిశుద్ధ్య పనులతో పాటు దోమల నివారణ కోసం ఫాగింగ్ చేయడం, యాంటీలార్వా కెమికల్ చల్లడం, వీధి దీపాల నిర్వహణ, తాగునీటి సరఫరా, బోర్ల మరమ్మతు, ఇంటి పన్నుల వసూళ్లు, ట్రాక్టర్ నడపడం, డంప్ యార్డుల్లో వర్మీ కంపోస్టు తయారీ ఇలా అన్ని పనులు చేయాల్సి ఉంటోంది.

భారంగానే అదనపు పనులు

గ్రామపంచాయతీల్లో మూడంచెల వ్యవస్థ కొనసాగుతోంది. పంచాయతీ కార్యదర్శికి సహాయకారి(గుమస్తా)గా ఒక మల్టీపర్పస్ వర్కర్ కొనసాగుతున్నారు. ఆయన పర్యవేక్షణలో కార్మికులు రోజువారీ విధులు నిర్వహించాలి. పంచాయతీ చిన్నదైనా, పెద్దదైనా ఇదే విధానం ఉంటుంది. అలాగే, ప్రభుత్వ సంబంధిత కార్యక్రమాల ప్రచారం, ఏర్పాట్లలో కూడా మల్టీపర్పస్ వర్కర్లే ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు తమకు ఏ పని అవసరమైనా మల్టీపర్పస్ వర్కర్లనే వినియోగించుకుంటుండడం గమనార్హం.

సాంకేతిక నైపుణ్య శిక్షణ లేకుండానే..

జీపీల్లో నిధులు అందుబాటులో లేక కార్మికులకు రెండు, మూడు నెలలకోమారు వేతనాలు చెల్లిస్తుంటారు. గడిచిన ఏడాదిగా నిధుల మంజూరు లేక వేతనాల చెల్లింపు మరింత జటిలంగా మారింది. ఈనేపథ్యాన మల్టీపర్పస్ వర్కర్ల ఖాతాల్లో ప్రభుత్వమే నేరుగా వేతనాలు జమ చేయాలని ఇటీవల నిర్ణయించింది. ఈ విధానంపై హర్షం వ్యక్తమవుతున్నా.... పనివిధానంపైనే అభ్యంతరాలు వస్తున్నాయి. ఒకరితోనే అన్ని పనులు చేయిస్తున్న క్రమాన వారికి శిక్షణ లేక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికే పలువురు మృతి చెందగా, మరికొందరికి గాయాలయ్యాయి.

మార్పులు అవసరం

పంచాయతీల్లో కార్మికులకు పనికి తగిన వేతనం చెల్లించాలని, మల్టీపర్పస్ పేరు మార్చాలని తరచుగా రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాల నుంచి డిమాండ్ వస్తోంది. వీటితో పాటు సాంకేతికతను జోడించేలా అవసరమైన శిక్షణ ఇప్పించాలనే డిమాండ్‌ను చేరిస్తే కార్మికులకు లబ్ధి జరగనుంది. అధికారులు సైతం వేతనాలు చెల్లించడం, ప్రమాదాలు జరిగినప్పుడు ఎంతో కొంత ఆర్థికసాయం చెల్లించి వదిలేయడమే తప్ప పనివిధానంలో ప్రక్షాళనపై దృష్టి సారించడం లేదు. ఈమేరకు ప్రమాదాలను అధిగమించేలా ట్రాక్టర్ డ్రైవర్, ఎలక్ట్రీషియన్, బోర్ మెకానిక్ వంటి విభాగాల్లో కార్మికులకు శిక్షణ ఇప్పించి అదనపు వేతనం చెల్లిస్తే ప్రజలకు నాణ్యమైన సేవలందించే అవకాశం ఉంటుంది.

శిక్షణ లేకనే ప్రమాదాలు



నిరుపేదలే జీపీల్లో మల్టీపర్పస్ వర్కర్లుగా నియమించబడ్డారు. వీరికి ఎలక్ట్రికల్, బోర్ల మరమ్మతు, ట్రాక్టర్ నడపడం రాకున్నా అలాంటి పనులే చేయిస్తున్నారు. శిక్షణ లేకుండానే పనులకు ఉపక్రమించడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

– వల్లాల మంగమ్మ, మాజీ సర్పంచ్, ఇల్లెందు మండలం

అవగాహన కల్పిస్తే మేలు



పంచాయతీలలో మల్టీపర్పస్ వర్కర్లకు పని విధానంపై కొంత శిక్షణ అవసరం. ప్రత్యేక క్యాంపుల ద్వారా చేస్తున్న పనులపై అవగాహన కల్పించాలి. తద్వారా ప్రమాదాలు తగ్గడమే కాక ప్రజలకు నాణ్యమైన సేవలు అందించే అవకాశం ఉంటుంది.

–మోకాళ్ల కృష్ణ, మాజీ సర్పంచ్, ఇల్లెందు మండలం

రాష్ట్ర స్థాయి క్రీడాపోటీలకు ఆతిథ్యం


రాష్ట్రస్థాయి పోటీలకు సిద్ధం చేస్తున్న గురుకుల కళాశాల క్రీడామైదానం

- లక్ష్మీదేవిపల్లిలో సాంఘిక సంక్షేమశాఖ గురుకులాల క్రీడాటోర్నీ
- ఈనెల 19నుంచి మూడు రోజుల పాటు నిర్వహణ
- హాజరుకానున్న 1,350 మంది క్రీడాకారులు

పాల్వంచ రూరల్: రాష్ట్ర స్థాయి క్రీడల నిర్వహణలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఏ క్రీడాంశాల్లో పోటీలైనా సమర్థవంతంగా నిర్వహించడం ఇక్కడి క్రీడా యూనియన్లు, వ్యాయామ ఉపాధ్యాయుల ప్రత్యేకత. అంతేకాకుండా వందలాది మంది క్రీడాకారులు హాజరైనా పోటీలు నిర్వహించే స్థాయిలో మైదానాలు అందుబాటులో ఉన్నాయి. దీంతో రాష్ట్ర స్థాయి టోర్నీల కేటాయింపులో జిల్లాకు తగిన ప్రాధాన్యత ఇస్తున్నారు. రెండేళ్ల క్రితం(2022) పాల్వంచలో సాంఘిక సంక్షేమ గురుకులాల రాష్ట్ర స్థాయి క్రీడాపోటీలు నిర్వహించగా.. మళ్లీ ఈ ఏడాది సైతం పాల్వంచ మండలం లక్ష్మీదేవిపల్లిలోని బాలుర గురుకుల కళాశాల ప్రాంగణాన్ని వేదికగా ఎంపిక చేశారు.

అన్ని వసతులు ఉండడంతో..

గతేడాది తొమ్మిదో రాష్ట్రస్థాయి గురుకుల క్రీడాపోటీలను ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని రాజ్‌పేట, నిజామాబాద్ జిల్లా ఉప్పలపాడులో నిర్వహించారు. ఈనెల 19నుంచి 21వ తేదీ జరగనున్న పదో రాష్ట్ర స్థాయి బాలుర పోటీల నిర్వహణకు లక్ష్మీదేవిపల్లి గురుకులాన్ని ఎంపిక చేశారు. ఇక్కడి సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాల ప్రాంగణంలో విశాలమైన క్రీడామైదానం, క్రీడాకారులకు అవసరమైన వసతి సౌకర్యం ఉండడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. కాగా, ఈ రాష్ట్రస్థాయి పోటీలకు రాష్ట్రంలోని 136 సాంఘిక సంక్షేమ శాఖ గురుకులాల నుంచి 1,350 మంది క్రీడాకారులు హాజరుకానున్నారు. అలాగే, పోటీల నిర్వహణలో పాలుపంచుకునేందుకు 200 మంది పీఈటీలు, పీడీలు వస్తారు. కాగా, పోటీల ప్రారంభ, ముగింపు సమావేశాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, గురుకులాల సంస్థ ఉన్నతాధికారులు, కలెక్టర్, ఐటీడీఏ పీఓ హాజరుకానున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే క్రీడామైదానాన్ని సిద్ధం చేయగా.. క్రీడాకారుల వసతి కోసం ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తాం...

ఈనెల 19నుంచి జరగనున్న రాష్ట్రస్థాయి సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ క్రీడాపోటీలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నాం. మా స్కూల్ ప్రాంగణంలో పోటీల నిర్వహణకు రెండో సారి అవకాశం దక్కడం ఆనందంగా ఉంది. ఇప్పటికే మైదానాలు సిద్ధం చేయడమే కాక క్రీడాకారులకు వసతి కల్పించేలా ఏర్పాట్లు చేస్తున్నాం.

– పాపారావు గురుకుల కళాశాల ప్రిన్సిపాల్, లక్ష్మీదేవిపల్లి

'గూడెం'లో ఎయిర్‌పోర్టు.. ఇల్లెందుకు రైలు

- బీజేపీ తరఫున అన్ని ప్రయత్నాలు చేస్తున్నాం
- మాజీ ఎంపీ అజ్మీరా సీతారాంనాయక్


మాట్లాడుతున్న సీతారాంనాయక్, పక్కన నాయకులు

ఇల్లెందు: కొత్తగూడెంలో ఎయిర్‌పోర్టు ఏర్పాటుతో పాటు ఇల్లెందుకు ప్యాసింజర్ రైళ్లు నడిపించేలా బీజేపీ తరఫున కేంద్రప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని మహబూబాబాద్ మాజీ ఎంపీ అజ్మీరా సీతారాంనాయక్ వెల్లడించారు. అయితే, ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి కేంద్రానికి ప్రతిపాదనలు పంపిన దాఖలాలే లేవని చెప్పారు. బీజేపీ నాయకుడు తాండ్ర వినోద్‌రావుతో కలిసి ఇల్లెందులో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దక్షిణ అయోధ్యగా పేరున్న భద్రాచలానికి దేశ, విదేశాల నుంచి వచ్చే భక్తుల కోసం ఎయిర్‌పోర్టు ఆవశ్యకతపై ఇటీవల కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడును కలిసి విన్నవించామని తెలిపారు. అయితే రాష్ట్రప్రభుత్వం నుంచి ప్రతిపాదన రావాలని సూచించడంతో కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌ను కోరినట్లు చెప్పారు. అలాగే, కేంద్ర రైల్వే మంత్రిని కలిసి గాంధీనగర్, కారేపల్లి, డోర్నకల్ జంక్షన్లకు లింక్ కలిపేలా ఇల్లెందుకు ప్యాసింజర్ రైళ్లు నడిపించాలని కోరగా ఇందుకు కూడా రాష్ట్రం నుంచి ప్రతిపాదనలు పంపించాల్సి ఉందన్నారు. ఇక బయ్యారం ఉక్కు పరిశ్రమ ఏర్పాటు అంశంలోనూ కదలికలు మొదలైనందున మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు ఈ ప్రాంతం అభివృద్ధి సాధించేలా ప్రాజెక్టుల సాధన కోసం ప్రతిపాదనలు పంపాలని సీతారాంనాయక్ కోరారు. కాగా, ఆళ్లపల్లి నుంచి మర్కోడు మీదుగా కరకగూడెం వరకు రోడ్డుకు ఎల్‌డబ్ల్యూఈ ద్వారా ప్రతిపాదనలు పంపిస్తే తాము కేంద్రంతో సమన్వయం చేస్తూ సాధిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు బలగానీ గోపికృష్ణ, నాళ్ల సోమసుందర్, రాం రెడ్డి, భూక్యా శ్రీనివాస్, మురళీకృష్ణ పాల్గొన్నారు.

సమష్టి కృషితో నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి


మాట్లాడుతున్న డీజీఎం యోహాన్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి ఉద్యోగులంతా సమష్టి కృషితో నాణ్యమైన బొగ్గును ఉత్పత్తి చేసి, వినియోగదారులకు అందించాలని గని ఏజెంట్ బి.రవీందర్, ఐఈడీ డీజీఎం యోహాన్ సూచించారు. కొత్తగూడెం ఏరియా పరిధిలోని పీవీకే–5 ఇంక్‌లైన్ గనిలో మల్టీ బుధవారం డిపార్ట్‌మెంట్ టీం సభ్యుల సమావేశం జరగగా వారు మాట్లాడారు. నాణ్యమైన బొగ్గును వినియోగదారులకు అందించడం ద్వారా సంస్థకు మరింత పేరు, లాభాలు వస్తాయని తెలిపారు. ఇటీవల కొన్నిసార్లు నిర్దేశిత బొగ్గు ఇవ్వని కారణంగా నష్టం వాటిల్లుతోందని చెప్పారు. ఈ మేరకు ఉద్యోగులు, కార్మికులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అనంతరం ఉత్పత్తి, ఉత్పాదకత, యంత్రాల పనితీరు, ఉద్యోగుల సంక్షేమానికి తీసుకుంటున్న చర్యలను డీజీఎం యోహాన్ వివరించారు. సమావేశంలో ఏజీఎం కె.హనసుమలత, డీజీఎం శివకేశవరావు, పీవీకే–5 మేనేజర్ శ్యాంప్రసాద్‌తో పాటు నాగభూషణం, వైవీఎస్‌కే కిశోర్‌బాబు, గోవర్ధన్, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.